సాక్షి నిర్మల్

శుక్రవారం । 13 । జనవరి । 2023

I



'అమ్మ' చెంత అదే చింత!

ఈ నెల 26న వసంత పంచమి కాగా, బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి సన్నిధిలో సరైన వసతులు లేవు. ఈ కారణంగా భక్తులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొనున్నారు.

IIలో▸



వివేకానందుడికి ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా స్వామి వివేకానంద జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఘన నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

IIIలో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0 / 14.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి తీవ్రత కాస్త తక్కువగా అనిపిస్తుంది.

న్యూస్‌రీల్

మొక్కల పెంపకం పనుల్లో వేగం పెంచాలి



పల్లె ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న విజయలక్ష్మి

తానూరు: మొక్కల పెంపకం పనుల్లో వేగం పెంచాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని బోల్సా గ్రామంలో ఆమె పర్యటించారు. నర్సరీ నిర్వహణ పనుల గురించి ఈజీఎస్ ఏపీవో గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. పల్లె ప్రకృతివనం, క్రీడాప్రాంగణం, నర్సరీని పరిశీలించి సంతృప్తి వ్యక్తంజేశారు. పల్లె ప్రకృతివనంలో నాటిన మొక్కలకు నీటిని అందించి ఎండిపోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈజీఎస్ ఏపీవో గంగాధర్, ఈసీ జితేందర్, సిబ్బంది ఉన్నారు.

'స్క్వాడ్‌పై దాడి సరికాదు'

నిర్మల్‌చైన్‌గేట్: డిగ్రీ పరీక్షల్లో కాపీ కొడితే డిబార్ చేశారన్న అక్కసుతో ఇచ్చోడలో ఫ్లయింగ్ స్క్వాడ్ కారుపై విద్యార్థులు దాడి చేయడం సరికాదని టీజీసీటీఏ రాష్ట్ర ఈసీ మెంబర్ పీజీ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అజయ్, ప్రధాన కార్యదర్శి మధు, టీజీసీజీటీఏ జిల్లా అధ్యక్షుడు కే మురళి, ప్రధాన కార్యదర్శి యూ రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దాడి చేసినవారితోపాటు మాస్ కాపీయింగ్ ప్రోత్సహిస్తున్న కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి భైంసా పోలీస్ క్రికెట్ లీగ్

భైంసాటౌన్: భైంసా యువతను ప్రోత్సహించేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఏఎస్పీ కిరణ్‌ఖారే గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు బీపీసీఎల్ (భైంసా పోలీస్ క్రికెట్ లీగ్) పోటీలను స్థానిక పార్డి (బి) బైపాస్‌రోడ్‌లోని మైదానంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భైంసా పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని ప్రతీ మండలం నుంచి రెండు టీంలు పాల్గొనవచ్చని తెలిపారు. మీడియా, రెవెన్యూ, బార్ అసోసియేషన్, మున్సిపల్, డాక్టర్లు క్రికెట్ టీంలుగా ఏర్పడి పోటీల్లో పాల్గొనాలని కోరారు. మొదటి బహుమతిగా రూ.21వేలు, రెండో బహుమతిగా రూ.11వేలు అందించనున్నట్లు వెల్లడించారు. యువత అధికసంఖ్యలో హాజరై టోర్నీని విజయవంతం చేయాలని ఏఎస్పీ కోరారు.

అల్ఫోర్స్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



భోగిమంట వేస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పల్లె వాతావరణం ఉట్టిపడేలా రంగురంగుల దుస్తులతో విద్యార్థులు ఆకర్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేశారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. పాలు పొంగించి, భోగి మంటలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ హర్షవర్ధని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

దస్తురాబాద్: మండల కేంద్రంలో నిర్మించిన ఎమ్మార్సీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే రేఖానాయక్ గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. అన్ని వర్గాలవారికి ప్రభుత్వం ఉచిత విద్య అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంపీపీ కిషన్, సర్పంచ్ రాజమణి, వైస్ ఎంపీపీ రాజునాయక్, జెడ్పీటీసీ శారద తదితరులున్నారు.



నానమ్మలతో వెళ్తున్న విద్యార్థినులు



సోఫీనగర్ గురుకుల పాఠశాల నుంచి తల్లిదండ్రులతో వెళ్తున్న విద్యార్థులు



విద్యార్థులు, ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్టాండ్

సంక్రాంతి సందడి

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు గురువారం ఇంటిబాట పట్టారు. తమ పిల్లలను తీసుకువెళ్లేందుకు తల్లిదండ్రులు వివిధ పాఠశాలలకు చేరుకోగా సందడి నెలకొంది. నిర్మల్ బస్టాండ్‌లో రద్దీ కనిపించింది. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు బస్సుల కోసం బారులుతీరారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

ఎన్‌ఎంసీ ఆమోదం కోసం..

- జిల్లాకు మంజూరైన మెడికల్ కాలేజీ తాత్కాలికంగా జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు
- సిద్ధమవుతున్న ప్రత్యేక చాంబర్లు
- త్వరలో ప్రిన్సిపాల్ నియామకం
- పలు దఫాలుగా పరిశీలించనున్న నేషనల్ మెడికల్ కౌన్సిల్ బృందం
- హర్షం వ్యక్తంజేస్తున్న జిల్లా ప్రజలు



జిల్లా ఆస్పత్రికి మెడికల్ కాలేజీ బోర్డు

నిర్మల్: జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాల ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. కాలేజీకి కావాల్సిన అనుమతులు రావాలంటే ముందుగా నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) బృందం పలు దఫాలుగా పరిశీలించాల్సి ఉంది. ఈమేరకు జిల్లా ఆస్పత్రిలోనే వైద్య కళాశాలకు సంబంధించిన తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. పలు దఫాలుగా ఎన్‌ఎంసీ తనిఖీలు ఉండనున్నాయి. మరో వారంపదిరోజుల్లో కొత్త మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కూడా రానున్నట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే జిల్లా ఆస్పత్రికి మెడికల్ కాలేజీ బోర్డులు అమర్చాలని ఆదేశాలు వచ్చాయి. ఈమేరకు వైద్యసిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు.

వంద సీట్లతో ప్రారంభం..

నిర్మల్ జిల్లా ప్రజలు ఎన్నోఏళ్లుగా ఎదురుచూస్తున్న మెడికల్ కాలేజీకి గతేడాది ఆగస్టు 9న రాష్ట్రప్రభుత్వం అక్షరరూపం ఇచ్చింది. ఆరోజు జిల్లాకు వైద్యకళాశాల పేరిట పరిపాలక అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతకుముందు జిల్లా నుంచి పంపిన ప్రతిపాదనలతో పాటు రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చివరకు చొరవ చూపగా ముందడుగు పడింది. అంతకుముందు రెండు దఫాలుగా మెడికల్ కాలేజీలను ప్రకటించిన జాబితాల్లో నిర్మల్‌కు స్థానం దక్కలేదు. మూడోసారి జిల్లాకు ప్రత్యేకంగా అవకాశమిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి రిజ్వి పేరిట ఇచ్చిన సదరు ఉత్తర్వుల్లో రూ.166కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం వందసీట్లతో కళాశాల ప్రారంభించనున్నట్లు తెలిపారు.



ప్రిన్సిపాల్ కోసం సిద్ధం చేస్తున్న గది

ఏర్పాట్లు చేస్తున్నాం

నిర్మల్‌లో మెడికల్ కాలేజీకి సంబంధించిన అడ్మినిస్ట్రేటివ్ మంజూరు పూర్తయింది. ఎన్‌ఎంసీ బృందం పలు దఫాలుగా పరిశీలన చేపడుతుంది. ఈమేరకు ఏర్పాట్లు పూర్తి చేయిస్తున్నాం. త్వరలో ప్రిన్సిపాల్ నియామకం చేస్తాం.

\- రమేశ్‌రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్

ఎన్‌ఎంసీ పరిశీలన తర్వాతే..

మెడికల్ కాలేజీకి మంజూరు కాగానే సరిపోదని, నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్‌ఎంసీ) ఆమోదించాలని వైద్యవర్గాలు పేర్కొన్నాయి. ఎన్‌ఎంసీ బృందం పలు దఫాలుగా కాలేజీ ఏర్పాట్లను పరిశీలిస్తుంది. మూడో విడతలో మంజూరైన కళాశాలలకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లాకేంద్రంలోనూ పనులు మొదలు పెడుతున్నారు. ప్రస్తుతం ఉన్న జిల్లా ఆస్పత్రిలోనే తాత్కాలికంగా మెడికల్ కళాశాలకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్‌ఎంసీ పరిశీలనల నేపథ్యంలో ముందుగా కళాశాలకు ప్రిన్సిపాల్‌ను నియమించనున్నారు. వారంలో సదరు ప్రిన్సిపాల్ రానున్నారు. ఈమేరకు జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక చాంబర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా ఆస్పత్రికి మెడికల్ కాలేజీ బోర్డులు పెడుతున్నారు. ప్రస్తుత ఆస్పత్రిలో వైద్యసేవలకు ఇబ్బంది కలగకుండా కాలేజీ కోసం ఏర్పాట్లు చేయనున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



వివేకానందుడికి నివాళులర్పిస్తున్న ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని వివేకానంద విగ్రహానికి గురువారం మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారతదేశానికి స్వామి వివేకానంద ఒక మణి రత్నం అని, ఆయన చరిత్ర ఎంతో గొప్పదని తెలిపారు. యువతను సరైన మార్గంలో నడిపించేందుకు ఎన్నో రచనలు, ప్రసంగాలు చేశారని గుర్తు చేశారు. ప్రపంచానికి భారతీయ వేదాంతం, ఆధ్యాత్మికత, యోగా తత్వాలను పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. రానున్న రోజుల్లో నిర్మల్ నడి ఒడ్డునున్న స్వామి వివేకానంద విగ్రహం వద్ద అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కంటివెలుగు కేంద్రం పరిశీలన



భైంసారూరల్: కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో ఈనెల 18న ప్రారంభించే కంటివెలుగు కేంద్రాన్ని గురువారం కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీ పరిశీలించారు. కేంద్రంలో ఎలాంటి లోటుపాట్లులేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని బృందాలు షెడ్యూల్ ప్రకారం 100 రోజులు కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతీరోజు గ్రామీణ ప్రాంతాల్లో 300 మంది, పట్టణ ప్రాంతాల్లో 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే , భైంసా ఆర్డీవో రవికుమార్, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రీస్, వైద్యుడు శ్రీకాంత్ తదితరులున్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న కంటివెలుగు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీ గురువారం పరిశీలించారు. ఈనెల 18వ తేదీ నుంచి కంటివెలుగు శిబిరాలు ప్రా రంభం కానున్నాయని, తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిజ్‌ఘోరి, ఆర్డీవో రవికుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక వైద్యాధికారులున్నారు.

లోకేశ్వరం: మండలంలోని బిలోలి గ్రామంలో కంటి వెలుగు కేంద్రం ఏర్పాట్లను కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీ గురువారం పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే, జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో సల్మాన్‌రాజ్, సర్పాపూర్ వైద్యాధికారి రాజేశ్, సర్పంచ్ సవిత, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు భుజంగ్‌రావు ఉన్నారు.

డేంజర్ మాంజా..!



ఖానాపూర్‌లోని దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్సై శంకర్ (ఫైల్)



మాంజా గాయం చూపుతున్న పెంచికల్‌పాడ్‌కు చెందిన వెంకటేశ్ (ఫైల్)

- చిన్నారులూ.. జరజాగ్రత్త
- ప్రాణాంతకం.. పతంగి దారం
- పరేషాన్ చేస్తున్న చైనా మాంజా
- ఇప్పటికే పలువురికి తీవ్రగాయాలు
- దుకాణాల్లో పోలీసుల తనిఖీలు

నిర్మల్: సంక్రాంతి.. ఈ పండుగంటే అందరికీ ఇష్టమే. చిన్నారులకైతే మరీ ఇష్టం. సరదాగా పతంగులను ఎగరేయవచ్చు. కానీ.. సరదాగా, ఆనందంగా జరుపుకోవాల్సిన పండుగపూట అనుకోనిది జరిగితే విషాదమే అవుతుంది. అలా మన పండుగను ప్రమాదకరంగా మారుస్తోంది చైనామాంజా. ఈ దారం ప్రాణాంతకంగా మారింది. ఇప్పటికే దీన్ని విక్రయించవద్దని ఆదేశిస్తున్నా చాలాచోట్ల విక్రయిస్తున్నారు. చాలా పదునుగా ఉండే ఈ దారం ఎదుటి పతంగిని త్వరగా తెంపేస్తుందన్న ఆశతో పిల్లలు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. కానీ.. పతంగులు ఎగురవేసేటపుడు ఈ దారం ఎవరి మెడకు చుట్టుకున్నా.. వేళ్లకు తగిలినా మరుక్షణమే దారుణంగా కోసేస్తుంది. జిల్లాలో ఇటీవలి కాలంలో మాంజా కారణంగా గొంతు, చేతివేళ్లు తెగినవాళ్లు, పరిస్థితి సీరియస్‌గా మారినవాళ్లూ ఉన్నారు.

షార్ప్‌గా ఉంటుందనే..

దేశీయంగా తయారు చేసే మాంజాలతో పోలిస్తే చైనా దారం చాలా పదునుగా ఉంటుంది. ప్లాస్టిక్ తీగలా ఉండే ఈ నైలాన్ దారాన్ని కిల్లర్ మాంజాగాను చెబుతుంటారు. ప్రతీ సంక్రాంతి ఈ దారంతో వందలాది పక్షులు విలవిల్లాడుతూ చనిపోతున్నాయి. దీన్ని పట్టుకుని కాస్త లాగితేనే వేళ్లపై చర్మం తెగిపోతుంది. అంత పదునుగా ఉండే ఈ దారం గొంతు, మెడ లాంటి సున్నితమైన చోట్ల రాసుకుపోతే ప్రాణాంతకంగా మారే ప్రమాదముంటుంది. పదునుగా ఉంటుందన్న కారణంగానే పిల్లలు ఈ మాంజాను కొనడానికి ఇష్టపడుతుంటారు. నిషేధిత మాంజాగా చెబుతున్నా.. ఇప్పటికీ అక్కడక్కడా దుకాణాల్లో విక్రయాలు కొనసాగుతున్నాయి. దీంతో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ప్రాణం మీదకు వచ్చింది

బైక్‌పై వెళ్తుండగా పక్కన పిల్లలు పతంగి ఎగరేస్తున్నారు. దానికి కట్టిన చైనామాంజా రోడ్డుపై ఒక్కసారిగా అడ్డు వచ్చింది. అంతే.. గొంతు భాగంలో గట్టిగా కోసుకుపోయింది. ఆ దారాన్ని చేత్తో లాగితే.. చేయి కూడా కోసుకుపోయింది. ఒక్కసారిగా రక్తం బయటకు వచ్చేసింది. బైక్ వేగం తక్కువగా ఉన్నందున ప్రాణాపాయం తప్పింది. లేకుంటే చైనామాంజా ప్రాణానికే ప్రమాదంగా మారేది.

\- ఆకుల రామకృష్ణ, నిర్మల్

తనిఖీలు నిర్వహిస్తున్నాం

ప్రమాదకరంగా మారే చైనామాంజాతో పాటు అలాంటి ఏ రకమైన దారాలనూ అమ్మవద్దని హెచ్చరిస్తున్నాం. ఇప్పటికే పలుసార్లు దుకాణాల్లో దాడులు నిర్వహించాం. చైనామంజాను చిన్నారులకు విక్రయించినట్లు తెలిస్తే అమ్మినవారిపై కేసులు పెడతాం.

\- శ్రీనివాస్, పట్టణ సీఐ, నిర్మల్

తనిఖీలు నిర్వహిస్తున్నా..

పోలీసులు తరచూ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నా.. మాంజా విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజలతో పాటు మూగజీవాలు, పక్షులకూ ప్రమాదకరంగా మారే ఈ దారాన్ని స్వచ్ఛందంగా తిరస్కరించాల్సిన అవసరం ఉంది. సంక్రాంతి సీజన్‌లో చాలావరకు పక్షులు ఈ దారం కారణంగానే మృత్యువాత పడుతున్నట్లు పక్షి ప్రేమికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సంతోషంగా జరుపుకోవాల్సిన పండుగ రోజు ఈ చైనా మాంజా వేళ్లను తెంచడం, మెడను కోయడం చేస్తే ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ చైనా మాంజాను పిల్లలకు కొనివ్వవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

వంట సిబ్బంది, ఎస్వోను తొలగించాలి

- కేజీబీవీ విద్యార్థినుల డిమాండ్
- మెనూ అమలు చేస్తలేరని ఆరోపణ
- సర్దిచెప్పిన సెక్టోరల్ అధికారి శ్రీదేవి



విద్యార్థినులతో మాట్లాడుతున్న శ్రీదేవి

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని కేజీబీవీని గురువారం సెక్టోరియల్ అధికారి శ్రీదేవి సందర్శించి విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ.. తమకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టడం లేదని ఆరోపించారు. నిత్యం ఒకే రకం కూరలు వండి వడ్డిస్తున్నారని తెలిపారు. ఈ విషయం ఎస్వోకు పలుసార్లు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. వంట సిబ్బంది, ఎస్వోను తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సెలవుల అనంతరం పాఠశాలకు రాబోమని తెలిపారు. ఈ విషయమై వంట సిబ్బంది, ఎస్వోతో సెక్టోరియల్ అధికారి మాట్లాడారు. సంక్రాంతి సెలవుల అనంతరం విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని, మెనూ విషయంలో అశ్రద్ధ వహించరాదని మందలించారు. ఈ విషయం డీఈవో దృష్టికి తీసుకువెళ్తానని హెచ్చరించారు. మెనూ ప్రకారం భోజనం అందేలా చూస్తామని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు హామీ ఇవ్వగా వారు సంతృప్తి చెందారు. అనంతరం విద్యార్థినులను సెలవులకు ఇంటికి తీసుకెళ్లారు.

ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్‌పై దృష్టి సారించాలి



రైల్వే మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ

ఆదిలాబాద్: ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ కోరారు. ఈ మేరకు మంత్రిని ఢిల్లీలో గురువారం కలిసి పలు రైల్వే సమస్యలను విన్నవించారు. పెండింగ్‌లో ఉన్న ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ పనులకు సంబంధించిన నిధులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. ఈ క్రమంలో రానున్న బడ్జెట్‌లో కేంద్రమే పూర్తిగా నిధులు వెచ్చించి పనులు పూర్తి చేసేలా చొరవ చూపాలని కోరారు. అలాగే ఉమ్మడి జిల్లా ప్రయాణికుల సౌకర్యార్థం కొన్ని రైళ్ల రాకపోకలను పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ వరకు నడుస్తున్న భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌ను బల్లార్షా వరకు పొడిగించాలని కోరారు. అలాగే సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని సంజీవయ్యనగర్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని, దక్షిణ్, హజ్రత్ నిజాముద్దీన్ రైళ్లను సిర్పూర్ కాగజ్‌నగర్‌లో నిలిచే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంత్రి సానుకూలంగా స్పందించారని, రానున్న బడ్జెట్లో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంపీ బాపూరావ్ తెలిపారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న తొమ్మిదో తెలంగాణ రాష్ట్ర సీనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలను రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. పోటీల్లో 20 జిల్లాలకు సంబంధించిన 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొదట నిర్మల్, పెద్దపల్లి జిల్లాలు తలపడ్డాయి. పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ ఎంపికైన క్రీడాకారులు రాజస్తాన్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాశరథి పొశెట్టి, సెక్రటరీ అన్నపూర్ణ, పేట అధ్యక్షుడు భూక్య రమేశ్, సెక్రటరీ కే భోజన్న, జనరల్ సెక్రటరీ రమణారావు, పీఈటీలు భూమన్న, ఎం.శ్రీనివాస్, జమున, సంగీత, శ్వేత, సంజు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మంచిర్యాలపై విజయం సాధించిన హైదరాబాద్ జట్టు

నేటి నుంచి మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవాలు

తానూరు: మండలంలోని మొగ్లి గ్రామంలోగల మహాలక్ష్మి ఆలయం వార్షికోత్సవానికి ముస్తాబైంది. ఇందులో భాగంగా శుక్రవారం నుంచి నిర్వహించనున్న జాతరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం సాయంత్రం మహాలక్ష్మి, పోచమ్మ ఆలయాల్లో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం మహాలక్ష్మి అమ్మవారిని ప్రత్యేక రథంలో ఊరేగిస్తారు. శనివారం ఉదయం ఆలయంలో భక్తులు మొక్కు తీర్చుకుంటారు. శనివారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఆలయ కమిటీ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మల్లయోధులకు కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. అంతర్రాష్ట్ర మల్లయోధులు హాజరై పోటీలో తలపడతారు. మొదటి బహుమతిగా రూ.8,101 వెండి కడియం, ద్వితీయ బహుమతిగా రూ.5,051 అందించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

మృతదేహం లభ్యం

సారంగపూర్: మండలంలోని ప్యారమూర్ గ్రామశివారు ప్రాంతంలో గురువారం దిలావర్‌పూర్ మండలం మాడెగాం గ్రామానికి చెందిన పులిండ్ల సంతోష్(30) మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... దిలావర్‌పూర్ మండలం మాడెగాం గ్రామానికి చెందిన పులిండ్ల సంతోష్ చిన్నతనం నుంచే మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. నడుచుకుంటూ ఎక్కడెక్కడో తిరిగేవాడు. ఈ క్రమంలో సారంగాపూర్ మండలంలోని ప్యారమూర్ గ్రామ శివారు ప్రాంతంలో దుర్వాసన రావడంతో పశువుల కాపరులు గమనించి గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. మృతుడి ఆచూకీ కోసం గాలించగా దిలావర్‌పూర్ మండలం మాడెగాం వాసిగా గుర్తించి వారి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి లింగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడు మానసిక రోగి కావడంతో చలికి, ఆకలిబాధకు తట్టుకోలేకనే మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

సిరిచెల్మ ఉపసర్పంచ్‌పై కత్తితో దాడి

- భూ పంచాయితే దాడికి కారణమా.?


గాయపడిన సిరిచెల్మ ఉపసర్పంచ్ అజీమ్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఓ హోటల్‌లో సిరిచెల్మ ఉపసర్పంచ్‌పై కత్తితో కొందరు దాడిచేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... మండలంలోని సిరిచెల్మ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ అజీమ్‌సుల్తాన్ మండల కేంద్రంలోని ఓ హోటల్‌లో భోజనం చేస్తున్నాడు. ఆ సమయంలో నలుగురు వ్యక్తులు దాడికి పాల్పడి పారిపోయారు. వెంటనే స్థానికులు అజీమ్‌ను ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. అయితే ఈ గొడవకు భూపంచాయితే కారణమని తెలుస్తోంది. కేశవపట్నం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ రైతుబంధు మండల అధ్యక్షుడు ముస్తాఫా కొంత మందితో తనపై దాడికి పాల్పడినట్లు బాధితుడు పేర్కొంటున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపాడు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య


భైంసాటౌన్: పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన సూర్యవంశి సుమిత్ (35) గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై హన్మాండ్లు కథనం ప్రకారం... సుమిత్ కొంతకాలంగా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం భార్య ఇంటికి వచ్చి చూడగా సుమిత్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించగా చుట్టుపక్కల వారికి తెలిపింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు.

వాంకిడిలో మహిళ..

వాంకిడి(ఆసిఫాబాద్): ఉరేసుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన మీర్జా జావెద్ బేగ్, అంజూమ్(22) దంపతులు మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో కొంత కాలంగా నివాసం ఉంటున్నారు. జావెద్ కూలీ పని చేస్తుండగా అంజూమ్ ఇంటివద్దే ఉంటోంది. గురువారం మధ్యాహ్నం అంజూమ్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి వచ్చిన భర్త ఇంటి బయట పిల్లలు ఏడుస్తూ ఉండటాన్ని గమనించి వెనుక తలుపు నుంచి ఇంట్లోకి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించింది.

‘అమ్మ’ చెంత అదే చింత

- ఈసారైనా భక్తులకు తిప్పలు తప్పేనా..?
- అమ్మవారి జన్మనక్షత్రం వేడుకలకు దగ్గరపడుతున్న ఘడియలు
- తరలిరానున్న భక్తజనం
- అధికస్థాయిలో వీవీఐపీల తాకిడి
- ఈసారి కూడా అరకొర వసతులే..
- కనీసం తాగునీరు కూడా దొరకని పరిస్థితి




తాగే నీటిలో దర్శనమిస్తున్న కప్పలు

బాసర(ముథోల్): బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి సన్నిధిలో జరిగే మహోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన ఉత్సవం వసంత పంచమి. అమ్మవారి జన్మ నక్షత్రమైన వసంత పంచమిని శ్రీపంచమి అని కూడా అంటారు. ఈ పర్వదినం ఈ నెల 26న రానుంది. ఆ రోజు అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేయించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు బాసరకు తరలివస్తుంటారు. కానీ ఆలయంలో సరైన వసతులు, ఏర్పాట్లు లేక భక్తులు యేటా తీవ్ర ఇక్కట్ల మధ్య పూజలు చేసుకుని తిరుగు ప్రయాణమవుతున్నారు. ఎప్పటిలాగానే ఈసారి కూడా అధికారులు ఏర్పాట్లు చేయడానికి సన్నద్ధం అవుతున్నారు. వేలల్లో వచ్చే భక్తుల రద్దీని ఊహించినదే అయినా చిన్నచిన్న మార్పులు తప్పితే చెప్పుకోతగిన స్థాయిలో ఏర్పాట్లు చేయడం లేదనే చెప్పొచ్చు. వసంత పంచమికి వచ్చే భక్తులకు ఈ ఏడాది కూడా అవే కష్టాలు ఎదురుకానున్నాయి.

కొరవడిన వసతి

ఉత్సవాల్లో బాసర అమ్మవారి దర్శనానికి వచ్చే వీఐపీ భక్తుల బసకు పాత ఆలయ అతిథి గృహాలను రూ.6కోట్లతో రినోవేషన్ చేసి సకల హంగులతో సిద్ధం చేశారు. కానీ సాధారణ భక్తుల బసను పట్టించుకున్న పాపన పోవడం లేదు. కేవలం రెండు వందల రూపాయల రుసుముతో బస కల్పించే టీటీడీ వసతి గృహంలో ప్రస్తుతం ఉపయోగానికి దాదాపు సగం రూములు మాత్రమే ఉన్నాయి. అవి కాస్త దీన స్థితిలో ఉండడం, ప్రైవేటు లాడ్జిల్లో వేల రూపాయలు వసూలు చేయడంతో భక్తులకు ఇబ్బంది తప్పడం లేదు.

తాగునీటికి కష్టమే..

అమ్మవారి జన్మనక్షత్ర ఉత్సవాల్లో భక్తులకు కనీసం తాగునీరు దొరకడం కష్టమే. ఇప్పటికే అక్కడక్కడ రెండు మూడు చోట్ల చిన్నవాటర్ కూలర్లు ఉంచి ఆలయ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. గుడి దగ్గరికి వచ్చిన భక్తులు క్యూలైన్ల ద్వారా అమ్మవారి దర్శనానికి వెళ్లే దత్తాద్రి గుడి వద్ద మరొకటి టెంకాయ కొట్టు ప్రదేశం వద్ద మాత్రమే వాటర్ కూలర్లు ఉన్నా అందులో తాజాగా కప్పలు, పురుగులు దర్శనమిస్తున్నాయి. నిర్వహణ సరిగాలేక నల్లాల వద్ద అపరిశుభ్రత చూసి ఆ నీరు తాగడానికి కూడా భక్తులు ఇష్టపడడం లేదు. ఇప్పటి వరకు అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు మొదలు అయినట్లు కనిపించడం లేదు.

ఏర్పాట్లలో లోపాలు

వసంత పంచమి సందర్భంగా తాత్కాలిక క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నారు. తాగునీటితో పాటు మధ్యలో అత్యవసరమైతే భక్తులు బయటకు వచ్చే పరిస్థితులు కల్పించడం లేదు. గంటల తరబడి నిల్చొనే భక్తులు కూర్చుందామంటే ఏర్పాట్లు చేయడం లేదు. ఏటా వీఐపీల కోసం క్యూలైన్లు.. అక్షర శ్రీకార పూజల కోసం గతంలో అదనపు ఏర్పాట్లు చేసిన అధికారులు సాధారణ భక్తుల విషయాలను మాత్రం గాలికి వదిలేస్తున్నారు.

సమస్యలపై దృష్టి పెట్టని అధికారులు..

గత అనుభవాలను ఆలయ అధికారులు మరచిపోయినట్లే ఉన్నారు. గత నవరాత్రి ఉత్సవాల్లో, వసంతి పంచమి వేడుకల సమయంలో భక్తులకు ఏర్పడిన అసౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేయడం లేదు. అదనపు క్యూలైన్లు, వివిధ దిశల్లో ఆలయంలో అధికారుల పూజలు, దర్శనం త్వరగా జరిగే కోణంలో ఆలోచన చేయడం లేదు. ఆలయ పూజారులు ఉన్నా భక్తుల రద్దీకి సరిపోవడం లేదు. బయట నుంచి అదనంగా పూజారులను తీసుకోవద్దని కొందరు అర్చకులు అధికారులను కోరినట్లు సమాచారం. దీంతో భక్తుల దర్శన సమయం పెరిగి ఇబ్బందుల పాలవుతున్నారు. క్యూలైన్ల భద్రత సిబ్బందిని పెంచుతున్నప్పటికీ పూజలు నిర్వహించే పండితుల సంఖ్యను మాత్రం పెంచడం లేదు.


ఆలయ రూములు లేక చలిలో ఆరుబయట నిద్రపోతున్న భక్తులు (ఫైల్)

డిగ్రీ పరీక్షల్లో 16 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ 3, 5 పరీక్షలు జరుగుతున్నాయి. గురువారం జరిగిన పరీక్షల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 మంది డిబార్ అయినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. ఇచ్చోడలోని సాయిసమత్ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, ఇచ్చోడ కాకతీయ డిగ్రీ కళాశాలలో ఐదుగురు, రెబ్బెనలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ముగ్గురు, ఆదిలాబాద్ పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక్కరు, మంచిర్యాల రిమ్స్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు.

కుంటాలను సందర్శించిన ట్రైనీ ఎఫ్ఆర్‌వోలు


మాట్లాడుతున్న సిరిచెల్మ రేంజ్ అధికారి

నేరడిగొండ: మండలంలోని కుంటాల జలపాతాన్ని గురువారం 9వ బ్యాచ్‌కు చెందిన ట్రైనీ ఎఫ్ఆర్‌వోలు సందర్శించారు. ఈ సందర్భంగా సిరిచెల్మ రేంజ్ అధికారి వాహబ్ అహ్మద్ వారికి స్వాగతం పలికారు. ఏకో టూరిజం కమిటీ ప్రాముఖ్యతతో పాటు కుంటాల జలపాతం విశిష్టతను వివరించాడు. కార్యక్రమంలో కుంటాల సెక్షన్ అధికారి వసంత్, ఎఫ్‌బీవో సచిన్, ఈడీసీ చైర్మన్ నర్సయ్య పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

- ఏటీఎంలో చోరీకి యత్నించి పట్టుబడ్డ వైనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఉమేందర్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఉమేందర్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో ఇటీవల ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేసిన దొంగను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. మరోసారి ఏటీఎంలో చోరీకి పాల్పడుతూ గురువారం పోలీసులకు చిక్కాడు. ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఎజాజ్ ఈనెల 8న ఆదిలాబాద్ పట్టణంలో రాత్రి 10 గంటల సమయంలో విరాజ్ రెస్టారెంట్ వద్ద బైక్‌ను దొంగిలించాడు. అర్ధరాత్రి సమయంలో బస్టాండ్ ప్రాంతంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో గడ్డపారాతో ఏటీఎంలో చోరీకి యత్నించాడు. సైరన్ మోగడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసుల భయంతో దుండగుడు మహారాష్ట్రలోని కిన్వట్‌కు వెళ్లి ద్విచక్ర వాహనం విక్రయించేందుకు యత్నించాడు. అక్కడ ఈ వాహనాన్ని కొనుగోలు చేసేందుకు ఎవరు ముందుకు రాలేదు. గురువారం తెల్లవారుజామున 4గంటల సమయంలో కన్యకా పరమేశ్వరి ఆలయం ఎదురుగా ఉన్న ఏటీఎం ఎదుట బైక్‌ను పార్కింగ్ చేసి చోరీకి యత్నించగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్నారు. కాగా నిందితుడు ఇదివరకు ఆటో నడిపేవాడు. గతంలో ద్విచక్ర వాహనాలు, ఓ ఆటోను దొంగలించాడు. ఈనెల 3న జైలు నుంచి బయటకు రాగా మరోసారి చోరీ చేసేందుకు చూశాడు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు జి.నారాయణ, హరిబాబు, అశోక్, అంజమ్మ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన కేయూ పరీక్షల విభాగం కంట్రోలర్


డిగ్రీ కళాశాలలో వివరాలు తెలుసుకుంటున్న కంట్రోలర్, అడిషనల్ కంట్రోలర్


ఇచ్చోడ: వివేకానంద డిగ్రీ కళాశాలలో పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ మల్లారెడ్డి, అడిషనల్ కంట్రోలర్ నరేందర్‌లు గురువారం ఎస్పీ డి.ఉదయ్‌కుమార్ రెడ్డిని కలిశారు. పరీక్ష కేంద్రంలో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడిన విద్యార్థులను డిబార్ చేయగా బుధవారం ఇచ్చోడలో కొంతమంది విద్యార్థులు స్కాడ్‌ల వాహనంపై దాడి చేసి అద్దాలు పగలగొట్టినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద పెట్రోలింగ్ నిర్వహించాలని, స్కాడ్ బృందాలకు భద్రత కల్పించాలని కోరారు. అంతకుముందు వారు ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని, ఇచ్చోడలోని పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. స్కాడ్‌గా వ్యవహరించిన జిల్లా కేంద్రంలోని సైన్స్ డిగ్రీ కళాశాలకు చెందిన లెక్చరర్ వాహనంపై దాడి చేయగా ఆయన నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు వారు తెలిపారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని డిగ్రీ పరీక్ష కేంద్రాలను గురువారం కాకతీయ యూనివర్సిటీ కంట్రోలర్ మల్లారెడ్డి, అదనపు కంట్రోలర్ నరేందర్ పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. సాయిసమత్ కళాశాల్లో మాస్‌కాపీయింగ్ పాల్పడుతున్న ముగ్గురు విద్యార్థులను డిబార్ చేశారు. వివేకానంద డిగ్రీ కళాశాలలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట పరీక్షల పరిశీలకులు ముజీబ్, సీఎస్ నిఖినివర్మ ఉన్నారు.

పద్మశ్రీ కనకరాజు బృందానికి ప్రథమ స్థానం


పద్మశ్రీ కనక రాజు కళాబృందం

నార్నూర్: యువజన ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్ శిల్పారామంలో నిర్వహించిన కళాపోటీల్లో జైనూర్ మండలంలోని మార్లావాయి గ్రామానికి చెందిన పద్మశ్రీ కనక రాజు కళాబృందానికి గురువారం ప్రథమ బహుమతి దక్కిందని సర్పంచ్ ప్రతిభ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. యువజన ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని శిల్పారామంలో జరిగిన కళా పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్నీ జిల్లాల నుంచి కళాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మార్లావాయి గ్రామానికి చెందిన పద్మశ్రీ కనక రాజు గుస్సాడీ కళాబృందం మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని కర్ణాటకలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. పద్మశ్రీ కనక రాజు జూనియర్ బృందాన్ని గ్రామస్తులు అభినందించారు.

కేబీసీ నారాయణపై చర్యలు తీసుకోవాలి


ఫిర్యాదు చేస్తున్న సంఘం నాయకులు

ఉట్నూర్‌రూరల్: నాల్గో తరగతి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా చెబుతూ.. ఉద్యోగులను, వర్కర్లను తప్పుదోవపట్టిస్తున్న కేబీసీ నారాయణపై తగు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా గిరిజన సంక్షేమశాఖ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్సై భరత్ సుమన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంగం నాయకులు మాట్లాడుతూ.. కేబీసీ నారాయణ అటెండర్‌గా గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వహించి మూడేళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందాడు. అతడికి ఉమ్మడి జిల్లా నాల్గో తరగతి ఉద్యోగుల సంఘంలో ఎలాంటి బాధ్యతలు లేనప్పటికీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పత్రిక ప్రకటనలు చేస్తూ ఉద్యోగులను, వర్కర్లను తప్పుదోవ పట్టిస్తున్నారని, నారాయణపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో ఆ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏరుకొండ రాజన్న, సంఘం నాయకులు బానోత్ బాపురావు, రాంకిషన్, అంజనబాయి, వచ్చేల బాయి ఉన్నారు.

అగ్నిప్రమాదంలో పత్తి దగ్ధం


కాలిన పత్తిని చూపిస్తున్న రైతులు

బేల: మండలంలోని పొలయితాండ గ్రామంలో గురువారం షార్ట్‌సర్క్యూట్‌తో రాథోడ్ గణేష్‌కు చెందిన పత్తి దగ్ధమైంది. సదరు రైతు ఇంట్లో 15 క్వింటాళ్ల పత్తిని నిల్వ ఉంచాడు. గురువారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో నాలుగైదు క్వింటాళ్ల పత్తి దగ్ధమైనట్లు బాధిత రైతు వాపోయాడు.

బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ దాడులు


గుడుంబా తయారీ పాత్రలతో అధికారులు

పెంబి: బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై సులోచన తెలిపారు. గురువారం మండల కేంద్రంతో పాటు ఇటిక్యాలతాండ, పెంబితాండ గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి రూ.20వేల విలువ గల మద్యాన్ని పట్టుకున్నారు. అలాగే ఇటిక్యాలతాండ గ్రామంలో గుడుంబా కోసం సిద్ధం చేసిన బెల్లంపానకాన్ని ధ్వంసం చేశారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

లక్ష్మణచాంద: సోన్ మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. వీడీసీ, ఆలయ కమిటీ, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ నరసింహామూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద మహా అన్నదానం చేశారు. సర్పంచ్ గంగామణి, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామి, ఎంపీటీసీ నాగయ్య, నాయకులు శ్రీనివాస్, అయ్యన్నగారి భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కలప పట్టివేత

కోటపల్లి(చెన్నూర్): మండలంలోని జనగామ నుంచి నాగంపేట మీదుగా టవేరా వాహనంలో 25 కలప దుంగలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో రవి తెలిపారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని, కలపను డిపోకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. కలప విలువ సుమారు రూ.లక్షా రెండువేల రూపాయలు ఉంటుందన్నారు. అక్రమంగా కలప రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలపను పట్టుకున్న వారిలో డెప్యూటీ రేంజర్ లావణ్య, బీట్ ఆఫీసర్ సంతోశ్ ఉన్నారు.

రేషన్‌బియ్యం స్వాధీనం

తాండూర్: మండలంలోని తంగళ్లపల్లిలో అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యాన్ని గురువారం రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాస్ ఇంట్లో సోదా చేయగా 6క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించారు. పంచనామా చేసి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎండీ ఎజాజొద్దీన్ కేసు నమోదు చేశారు.

‘ఓపెన్’లో స్పెషల్ అడ్మిషన్లు

- ‘పది’ ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- నేటితో ముగియనున్న గడువు

2022–23 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు

జిల్లా	ఎస్సెస్సీ	ఇంటర్
ఆదిలాబాద్	808	401
కుమురంభీం	380	278
మంచిర్యాల	589	1,144
నిర్మల్	713	448


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: 2022–23 విద్యాసంవత్సరానికి ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశానికి స్పెషల్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. జనవరి 9 నుంచి 13 వరకు విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. చదువు మధ్యలో మానేసిన వారు, ఎస్సెస్సీ, ఇంటర్‌లో ఫెయిలైన వారంతా ఓపెన్ విధానం ద్వారా ఒకే సంవత్సరంలో పూర్తి చేసే వీలుంది. ఈ విద్యాసంవత్సరానికి గానూ ఇప్పటి వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓపెన్ ఇంటర్‌లో 2,271 మంది, పదోతరగతిలో 2,490 మంది విద్యార్థులు ప్రవేశం పొందినట్లు ఓపెన్ స్కూల్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ అశోక్ తెలిపారు.

అర్హతలు ఇవే..

2022 ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాలు నిండిన వారు పదోతరగతి, 15 సంవత్సరాలు నిండి పదోతరగతి పాసైనవారు ఇంటర్‌లో ప్రవేశానికి అర్హులు. పదోతరగతిలో ప్రవేశానికి జనరల్ విద్యార్థులకు రూ.1400, ఇతరులకు రూ.1000, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.150, ఇంటర్‌లో ప్రవేశానికి జనరల్ విద్యార్థులకు రూ.1500, ఇతరులకు రూ.1200, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300 ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది.

దోడందకు గంగజల యాత్ర


గంగజల యాత్రలో మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: ఈ నెల 21న నిర్వహించే నాగోబా మహాపూజకు గంగజలం కోసం వెళ్లిన మెస్రం వంశీయులు తిరుగుపయణంలో గురువారం రాత్రి మండలంలోని దోడంద గ్రామానికి చేరుకున్నారు. ఈ నెల 10న జన్నారం మండలంలోని హస్తనమడుగులో సేకరించిన గంగజలంతో మెస్రం వంశీయులు ఉట్నూర్ మీదుగా దోడంద గ్రామ పొలిమేరకు చేరుకున్నారు. అక్కడ గంగజలాన్ని మెస్రం వంశం అల్లుడి సాయంతో మామిడిచెట్టుపై భద్రపరిచారు. అనంతరం వారివారి ఇళ్లకు వెళ్లారు. ఈ నెల 17న దోడంద నుంచి ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. అదేరోజు సాయంత్రం కేస్లాపూర్ సమీపంలోని వడమర(మరి చెట్టు) వద్దకు చేరుకుని బస చేస్తారు. మెస్రం వంశీయులు వారి కుటుంబంలో మృతిచెందిన పెద్దల పేర్లతో తూమ్ (కర్మఖాండ) పూజలు చేయనున్నట్లు ప్రధాన్ సమాజ్ పెద్ద మెస్రం దాదారావ్ తెలిపారు. ఈ నెల 21న పుష్యమాసం అమవాస్యను పురస్కరించుకుని తీసుకువచ్చిన గంగజలంతో నాగోబా ఆలయాన్ని శుద్ధిచేసి రాత్రి మహాపూజ చేసి జాతరను ప్రారంభించనున్నారు. ఈ యాత్రలో మెస్రం వంశీయులు మెస్రం దేవ్‌రావ్, మెస్రం గణపతి, మెస్రం తిరుపతి ఉన్నారు.

ఆదివాసీ సంస్కృతిని కాపాడాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి

నార్నూర్: ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. గురువారం జైనూర్ మండలంలోని జంగాంలోని జంగో లింగో దీక్షా భూమి దేవాలయాన్ని ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే దీక్షాభూమి నిర్వాహకులకు వంటపాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని వాటిని రానున్న తరాలకు అందించాల్సిన బాధ్యత నేటి సమాజంపై ఉందన్నారు. పుష్యమాసంలో ఆదివాసీ సమాజం నెలరోజుల పాటు కఠోర నియమాలతో ఉంటూ భక్తి శ్రద్ధలతో దేవతలను పూజించడం అనాధిగా వస్తున్న ఆచారం అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడకపోతే జాతి మనుగడ భవిష్యత్‌లో ప్రశ్నార్థకంగా మారనుందని వివరించారు. జంగోలింగో దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం జంగం దీక్షా భూమి దేవాలయంలో దీక్షాభూమి పీఠాధిపతి కుమ్ర భగవంతరావు చేతుల మీదుగా జంగోలింగో దీక్షా స్వీకరించారు. ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు, జంగో, లింగో ఘాన్ సంస్థానం అధ్యక్షుడు ఆత్రం రఘునాథ్, స్థానిక సర్పంచ్ శ్యాంరావు, ఎంపీటీసీ కుమ్ర భగవంతరావు, ఉషేగాం సర్పంచ్ ఉయిక రామకాంత్ దుబ్బాగూడ సర్పంచ్ మాడవి భీంరావు ఉన్నారు.


దీక్షాభూమి వద్ద వంటపాత్రలు ఇస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి